జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకుందాం

- వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకుందామని వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జూటూరు గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి ఓటేయాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేసిన జగనన్న మరోసారి ముఖ్యంత్రి కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఓ కాలనీలో వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వడ్డే రంగమ్మ, బలరాముడు, మాజీ సర్పంచు జయచంద్రారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వడ్డే రంగన్న, మల్లికార్జున, బళ్లారి మోహన్‌క్రిష్ణ, కేశవరెడ్డి, గుజ్జుల క్రిష్ణ పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

పత్తికొండ–ఆదోని రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆపార్టీ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి సోమశేఖర్, ఎంపీపీ నారాయణదాస్, మండల కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పత్తికొండలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కంగాటి శ్రీదేవి

కంగాటి శ్రీదేవిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ కోరారు. పత్తికొండలోని స్టేట్‌బ్యాంకు లైన్, టీచర్స్ కాలనీ, కటికె వీధిలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో సర్పంచు కొమ్ము దీపిక, ఉపసర్పంచు కళావతి, పార్టీ నాయకులు కంగాటి వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


పత్తికొండలో ఓటు అభ్యర్థిస్తున్న మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, నాయకులు


బురుజులలో ప్రచారం చేస్తున్న కంగాటి శ్రీదేవి

బురుజుల గ్రామంలో..

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ జయలక్ష్మి, నాయకులు భరత్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బయ్యతో కలిసి ఆమె ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేసి తనకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు శంకర్, మండల కన్వీనర్ వెంకటేశులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని మన్నెకుంట, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామాల్లో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ కేశసుహాషిణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకట్రాముడు, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ చందనారెడ్డితో కలిసి వారు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రభుత్వం చేసిన మంచిని వివరించి మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకుందామని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఉమర్‌బాషా, చంద్రారెడ్డి, మూలింటి మాదన్న, శివ, జేసీబీ రాముడు, రామలింగం, సుదర్శనం, మల్లికార్జున, బ్రహ్మానందరెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.


ఎస్‌హెచ్ ఎర్రగుడిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని చెర్లకొత్తూరు, రామళ్లకోట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని, ఎంపీగా బీవీ రామయ్యను గెలిపించాలని కోరారు.


రామళ్లకోటలో ఓటేయాలని మహిళలను కోరుతున్న రామ్మోహన్ రెడ్డి

ఈ రోజు

పెరవలిలో కంగాటి శ్రీదేవి ప్రచారం



మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు సర్పంచ్ మల్లికార్జున తెలిపారు. కార్యకర్తలు, నాయకులు ప్రచారంలో పాల్గొనాలన్నారు.

ఆలూరు అభ్యర్థి విరూపాక్షి..



హొళగుంద: మండలంలోని ఎల్లార్తి, చిన్నహ్యాట, పెద్దహ్యాట, బీజీ హళ్లి గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినె విరూపాక్షి ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

తుగ్గలి మండలంలో..

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కంగాటి శ్రీదేవి, బీవై రామయ్యను గెలిపించాలని కోరుతూ శనివారం లింగనేనిదొడ్డి, బొందిమడుగుల, నునుసరాళ్ల, నల్లగుండ్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్‌మాదవ్ తెలిపారు. పార్టీ నాయకులు రమ్యరెడ్డి తదితరులు ఇంటింటికి తిరిగి ఫ్యాన్‌కు ఓటేయాలని కోరుతారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

నేటి నుంచి భంభం ఉరుసు

చిప్పగిరి: మండల కేంద్రంలోని భంభం స్వామి ఉరుసు కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు భంభం స్వామి దర్గా పెద్దలు సయ్యద్ హర్షద్ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం గంధం, ఆదివారం ఉరుసు ఉటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామిని దర్శించుకోవాలన్నారు.

ఎన్డీఏ అభ్యర్థులను ఓడించాలి


మాట్లాడుతున్న కె రామచంద్రయ్య

కృష్ణగిరి: ఎన్డీఏ కూటమి అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని ఇండియా కూటమి పత్తికొండ అభ్యర్థి, సీపీఐ నాయకుడు కె రామచంద్రయ్య కోరారు. శుక్రవారం ఆయన కృష్ణగిరిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, పట్టణంలో ప్రచారం నిర్వహించారు. దేశంలో మోదీ పాలన అధ్వానంగా ఉందన్నారు. ప్రజల కోసం పని చేసే తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు గిడ్డయ్య, నబీరసూల్, లెనిన్‌బాబు, రవిమోహన్ పాల్గొన్నారు.

వైభవంగా సాయిబన్న దాదా ఉరుసు


దర్గా వద్దకు గంధాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలోని సాయిబన్న దాదా గంధం, ఉరుసు ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉరుసుకు తరలి వచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం అర్ధరాత్రి మేల్‌మరే వంశీకులకు సంబంధించిన మంచద మనే నుంచి గంధాన్ని గుర్రంపై దర్గాకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు దారి పొడవునా కర్రలు, అగ్గి కాగడాలతో విన్యాసాలు, బల ప్రదర్శనలు నిర్వహించారు. గంధం దర్గాకు చేరుకోవడంతో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. రాత్రి భజన, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. శనివారం జియారత్‌తో ఉత్సవాలు ముగియనున్నాయి.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందామని జేసీఎస్ మండల కన్వీనర్ బసవరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని జొహరాపురం, తంగరడోణ, తురువగల్లు గ్రామాల్లో ఆయన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు గురించి వివరించి ఓటు వేయాలని కోరాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా బుసినె విరూపాక్షిని గెలిపించాలని కోరాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సర్పంచులు శంకరమ్మ, నెల్లూరప్ప తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వెల్దుర్తి(కృష్ణగిరి): కృష్ణగిరి మండల పరిధిలోని చిట్యాల – కోయిలకొండ గ్రామాల మధ్య గురువారం రాత్రి బైక్ ప్రమాదంలో మృతిచెందిన వెల్దుర్తి మండలం రత్నపల్లె గ్రామానికి చెందిన యమగాని అనంతయ్య (33) కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి తదితరులు పరామర్శించారు.

నేడు పాలీసెట్ ప్రవేశపరీక్ష

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు శనివారం ప్రవేశ పరీక్ష (పాలీసెట్) జరగనున్నట్లు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్షకు ఆదోని పట్టణంలో 10 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 3012 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

గురుకుల ప్రవేశాలకు 29న కౌన్సెలింగ్

పగిడ్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి దిన్నెదేవరపాడు (జగన్నాథ గట్టు) గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1:3 నిష్పత్తి ప్రకారం మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు మెరిట్ కార్డు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో సోమవారం ఉదయం 8.30 గంటలకు హాజరు కావాల సూచించారు. ఎస్సీ విద్యార్థులకు 47 నుంచి 18 మార్కుల వరకు, ఎస్టీ విద్యార్థులకు 37 నుంచి 19 మార్కుల వరకు, బీసీ విద్యార్థులు 47 నుంచి 42 మార్కుల వరకు వచ్చిన విద్యార్థులు కౌన్సిలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

హోరాహోరీగా సాగిన గిరక బండి పోటీలు

వెల్దుర్తి(కృష్ణగిరి): రామళ్లకోట వనం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈనెల 17న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు భూదేవి, శ్రీదేవి సమేత వనం లక్ష్మీవెంకటేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, కల్యాణం, వివిధ వాహన సేవలు, రథోత్సవం, వసంతోత్సవం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు బండలాగుడు, గుండు, చందాఎత్తడం, తాడు లాగడం, ట్రాక్టర్ రివర్స్ పందేల వేడుకల నిర్వహణతో శుక్రవారం నాటికి ముగిశాయి. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరుగడంలో సహకరించిన అందరికీ, దాతలకు నిర్వాహకులు, చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, సర్పంచ్ నిర్మల, ఆలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

విజేత లక్ష్మీపురం ఎద్దులు


పోటీలను ప్రారంభిస్తున్న మాధవస్వామి

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన గిరక బండి పోటీలు హోరాహోరీగా సాగాయి. ముందుగా పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి ప్రారంభించారు. పోటీలలో 19 జతల ఎద్దులు పాల్గొనగా 3,327 అడుగుల దూరం గిరక బండిని లాగి కల్లూరు మండలం లక్ష్మీపురం వెంకటేశ్వర్లు ఎద్దులు విజేతగా నిలిచి రూ.20వేల నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా ఉల్చాల మస్తాన్ ఎద్దులు, నాయకల్లు ఉప సర్పంచ్ షమ్‌షేర్ ఎద్దులు, కోడుమూరు లద్దగిరి జీఎస్‌ఆర్ ఎద్దులు నిలిచి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. డి రంగాపురం సాయనాథరెడ్డి వ్యాఖ్యానం రైతులను ఆకట్టుకుంది. దాతలు, నిర్వాహకులు విజేతలకు నగదు బహుమతులందించారు. మిట్టమీది ఖాసిం సాహెబ్, చింతకాయల రాజు, దాతలు వెంకటరమణ, బూషి, పుల్లగుమ్మి కృష్ణ, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


భూదేవి, శ్రీదేవి సమేత వనం లక్ష్మీవెంకటేశ్వరస్వామి

ఈవీఎంల స్ట్రాంగ్ రూం పరిశీలన

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను ఎన్నికల పరిశీలకులు ఐపీఎస్ అధికారి ఉమేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ అనంతరం పోలింగ్ కేంద్రం నంబర్ల వారీగా ఈఎంలు ఉంచే రూములు తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు భద్రతా సిబ్బందితో మాట్లాడారు. 24 గంటలు కళాశాల చుట్టూ ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రాము నాయక్, ఏఈఆర్వో చంద్రశేఖర్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఓబులేషు ఉన్నారు.


స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న పరిశీలకులు ఉమేష్ కుమార్

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్ట్ చేసి బెయిల్‌పై వదిలినట్లు ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.52,500 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరికి గాయాలు

హొళగుంద: సుళువాయి రోడ్డులో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలైనట్లు ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు శుక్రవారం తెలిపారు. ఆదోనికి చెందిన జగన్నాథం, కర్ణాటక రాష్ట్రం కుడితినికి చెందిన హేమంత్ పెద్దహ్యాటకు బైక్‌పై వచ్చారు. హొళగుందకు వస్తుండగా ఆదోని డిపో బస్సు ఢీకొంది. ప్రమాదంలో జగన్నాథంకు తీవ్ర గాయాలు, హేమంత్‌కు స్వల్ప గాయాలైనట్లు ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా


పార్టీలో చేరిన వారితో విరూపాక్షి

- ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి

హాలహర్వి: తను ఓటేసి ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి అన్నారు. శుక్రవారం మండలంలోని గూళ్యం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలంటే తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. చంద్రబాబునాయుడు మాటలు నమ్మవద్దని, టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు ఇళ్ల వద్దకే అందాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఉండాలన్నారు. అందుకు వచ్చే నెల 13 ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, బీవీ రామయ్యను ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిదానందప్పగారి హనుమంతరెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు శశికళకృష్ణమోహన్, రామారెడ్డి, జనార్దన్‌నాయుడు, మల్లి, గంగాధర, బజారప్ప, రాఘవేంద్రరెడ్డి, వీరేశప్ప, కుమారస్వామి, గోపాల్, సోమప్ప, తిప్పారెడ్డి, శ్రీకాంతప్ప, వన్నూరప్ప, సుంకన్న, శ్రీనివాసులు, దిబ్బలింగ, పరశురామ్ పాల్గొన్నారు.


హాలహర్విలో గృహప్రవేశంలో విరూపాక్షి, శశికళ

వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: హాలహర్వి, సిద్దాపురం గ్రామాల నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 35 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. శుక్రవారం వారికి వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరు పాక్షి తన స్వగృహంలో కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బాషా, సిద్దయ్య, గోపాల్, గాదిలింగప్ప, గోవిందరాజులు, అంజి తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి మండలంలో..


కామినహాళ్‌లో ప్రచారం చేస్తున్న వైకుంఠం మల్లికార్జునచౌదరి, తదితరులు

హాలహర్వి మండలం కామినహాళ్, చింతకుంట, శిరుగాపురం, చింతకుటం, ఎంకే పల్లి, శిరుగాపురం తదితర గ్రామాల్లో విరూపాక్షిని గెలిపించుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకులు వైకుంఠం మల్లికార్జునచౌదరి, కోనంకి జనార్దన్‌నాయుడు ప్రచారం నిర్వహించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకోవాలని, అందుకు ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా విరూపాక్షిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో హాలహర్వి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రేగుల రమణ, నాయకులు ఏరూరు మోహన్, రవీంద్ర, నారాయణ తదితరులు ఉన్నారు.

ఆలూరు: నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినే విరూపాక్షి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ ఈరన్నతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరించి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు అభివృద్ధి నిరోధకులని, వారికి ఓటేస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని వివరించారు. తనను గెలిపిస్తే సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయిస్తానని, ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా నాయకురాలు శశికళ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, నాయకులు కృష్ణమోహన్, నాగవేణి, హనుమంతమ్మ, వీరేష్, బోయ ఎల్లమ్మ, మోతి ఎల్లమ్మ, జీరా నాగమ్మ, బాషా తదితరులు పాల్గొన్నారు.


ఆలూరులో ఓటేయాలని కోరుతున్న విరూపాక్షి

తుగ్గలి మండలం నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు

తుగ్గలి: జిల్లాలో రాజకీయాలకు పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం పెట్టింది పేరు. ఈ మండలం నుంచి ఇప్పటి వరకు ఐదుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1967లో జీ.ఎర్రగుడికి చెందిన కనికిరెడ్డి ఈశ్వరరెడ్డి సీపీఎం తరపున గెలుపొందారు. 1983లో టీడీపీ ఆవిర్భావంతో అంతటా ఆ పార్టీ గాలి వీచినా పత్తికొండలో మాత్రం తుగ్గలికి చెందిన మాదిరెడ్డి తమ్మారెడ్డి (కాంగ్రెస్) విజయకేతనం ఎగురవేశారు. వ్యాపారం నిమిత్తం గుంతకల్లుకు వెళ్లి స్థిరపడిన తుగ్గలికి చెందిన పత్తి రాజగోపాల్ అదే సమయంలో అనంతపురం జిల్లా గుత్తి నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. 1985లో మండలంలోని పెండేకల్లుకు చెందిన కె మహాభలేశ్వరగుప్త పత్తికొండలో స్థిరపడి ఎమ్మెల్యేగా(టీడీపీ) గెలిచారు. ఆయన హత్యానంతరం జరిగిన ఉప ఎన్నికల్లో గుప్త సతీమణి కె.సుబ్బరత్నమ్మ (టీడీపీ) పత్తికొండ నుంచి విజయం సాధించారు. ఇలా ఒకే మండలానికి చెందిన ఐదుగురు మూడు పార్టీల తరపున రెండు నియోజకవర్గాల్లో గెలుపొందారు.

తర్తూరులో కొనసాగుతున్న భక్తుల రద్దీ

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసినా స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తుల తాకిడి కొనసాగుతూనే ఉంది. పది, ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడటంతో ఉత్తీర్ణులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులను వెంటబెట్టుకొని తర్తూరు జాతరకు వస్తుండటంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తగా జాతర భక్తులతో కిక్కిరిసింది.

స్వామివారిని దర్శించుకున్న జడ్జి

కర్నూలు జూనియర్ సివిల్ జడ్జి, నందికొట్కూరు జూనియర్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వందన శుక్రవారం తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకటరమణ జడ్జికి సాదారంగా స్వాగతం పలికారు. వారు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ న్యాయమూర్తికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయగా అర్చకులు ఆశీర్వాదాలు పలికారు.


న్యాయమూర్తి వందనకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేస్తున్నఈఓ, అర్చకులు

నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి

- 12 నామినేషన్లు తిరస్కరణ
- ఆలూరు అసెంబ్లీ ఆర్‌ఓ రాము నాయక్


నామినేషన్ల పరిశీలన ప్రక్రియకు హాజరైన వివిధ పార్టీల అభ్యర్థులు

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం పూర్తి చేసినట్లు ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రాము నాయక్ తెలిపారు. ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి 15 మంది అభ్యర్థులు 25 నామినేషన్లు దాఖలు చేశారన్నారు. నామినేషన్ల పరిశీలనలో వివిధ కారణాల చేత 12 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా.. 13 మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు ఆమోదించామన్నారు. ఏ, బీ–ఫారం సమర్పించని కారణంగా బుసినే రామాంజనమ్మ, గిరి మల్లేష్ గౌడ్ నామినేషన్లు రిజెక్ట్ చేశామన్నారు. శనివారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

పత్తికొండటౌన్: పత్తికొండ అసెంబ్లీకి 14 మంది అభ్యర్థులు 24 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, ఆర్‌డీఓ నీలపు రామలక్ష్మి ఆధ్వర్యంలో పరిశీలించారు. వివిధ కారణాలతో ముగ్గురి నామినేషన్లు తిరస్కరిచామని, 11 మంది అభ్యర్థులు నామినేషన్లు ఆమోదించామని ఆర్‌ఓ తెలిపారు.

కోలుకోలేక వివాహిత మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 9న వంట చేసే క్రమంలో గ్యాస్ లీకై మంటలు రేగిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వెల్దుర్తికి చెందిన ప్రశాంతి(36) కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. జీజీహెచ్‌లో పోస్టు మార్టం అనంతరం వెల్దుర్తిలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి భర్త టీచర్ వెంకట్రాముడు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆలూరు రూరల్: ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో 76 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజు ప్రజలు నిర్భయంగా ఓటు వేసుకోవచ్చన్నారు. ఎవరైనా ఓటర్లను భయపెట్టడం, మభ్యపెట్టడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు తెలిస్తే సీ–విజిల్ యాప్ ద్వారా సమాచారం అందించవచ్చన్నారు.